నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ గురువారం 5 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

పోషణ మాసాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలి

పోషణ మాసం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 4 : పోషణ మాసం కార్యక్రమంలోని నిర్దేశిత లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో పోషణ మాసం కార్యక్రమం పై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా వారాలవారీగా ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో రాజేందర్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, మెప్మా పీడీ సుభాష్ పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను అడ్డుకోవద్దు

రేంజ్ కార్యాలయం ఎదుట బైఠాయించిన వజ్జర్ గ్రామ గిరిజనులు

బోథ్, సెప్టెంబర్ 4 : అజ్జర్-వజ్జర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఐదు గిరిజన గూడలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను నిర్దేశించిన విద్యుత్ లైన్ పనులు అడ్డుకోవద్దని కోరుతూ బుధవారం పంచాయతీ పరిధిలోని గ్రామాల గిరిజనులు బోథ్‌లోని రేంజ్ కార్యాలయానికి తరలివచ్చారు. అక్కడ బైఠాయించారు. ఇది వరకు ఐదు గూడేలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఉండేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కొత్త లైన్ పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడంతో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేక మోటర్లు నడవలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనులను సజావుగా జరిగేలా చూడాలని కోరారు. అటవీ శాఖాధికారులు ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో గిరిజనులు ఆందోళన విరమించారు.

గ్రామస్తులతో కలిసి నృత్యం చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, సెప్టెంబర్ 4 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం అర్లి(కే) గ్రామంలో 24 ఏండ్ల తర్వాత నెల రోజులు నిర్వహిస్తున్న అఖండ జ్యోతి ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామస్తులతో కలిసి నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంచుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం మండలంలోని ధనోర గ్రామానికి చెందిన జి.వనితకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.12,500, గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన సి.నర్సింహ రావ్‌కు మంజూరైన రూ.48 వేల చెక్కును అర్లి(కే) గ్రామంలో అందజేశారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

బీసీ సంఘం నాయకుల ధర్నా

ఎదులాపురం, సెప్టెంబర్ 4 : ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల ముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘం జాతీయ అధ్యక్షుడి పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సగం కంటే ఎక్కువ జనాభా బీసీలదే ఉందన్నారు. ప్రస్తుతం బీసీలకు 23 శాతం రిజర్వేషన్ ఉందన్నారు. దానిని 42 శాతం ప్రకటించిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తు, నాయకులు రాంకుమార్, అంజయ్, అశోక్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

నేడు హైదరాబాద్‌లో అవార్డులు అందుకోనున్న ఉపాధ్యాయులు

నిర్మల్ అర్బన్/భైంసా, సెప్టెంబర్ 4 : యేటా సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రభుత్వం అవార్డులను అందిస్తున్నది. అంకితభావంతో విధులు నిర్వహించిన పలువురు ఉపాధ్యాయులను రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించారు. వీరిలో సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలకు చెందన ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ కూన రమేశ్, లక్ష్మణచాంద మండలంలోని పీచర ఎంపీపీఎస్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ దాసరి శంకర్, భైంసా మండలంలోని ఎంపీపీఎస్ దేగాంలో సెకండరీ గ్రేడ్ టీచర్ పల్సి శ్రీనివాస్.. ఉన్నత విద్యలో బాసర ట్రిపుల్ ఐటీలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ డాక్టర్ చంద్రశేఖర్‌రావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోనున్నారు.

నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యూఆర్ పార్ట్‌టైం ఉద్యోగులు

సీఆర్టీ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలి

కడెం, సెప్టెంబర్ 4 : సీఆర్టీ, పొరుగు సేవల ఉద్యోగాల్లో తమకు ప్రథమ ప్రాధాన్యత కల్పించాలని ఎస్‌డబ్ల్యూఆర్ పార్ట్‌టైం ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురుకుల పాఠశాల, కళాశాలల్లో రెగ్యూలర్ ఉపాధ్యాయులతో సమానంగా తాము సేవలందించడం జరుగుతుందని, తమను తొలగించడం అన్యాయమన్నారు. రానున్న సీఆర్టీ, పొరుగు సేవల ఉద్యోగాల్లో తమకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఆర్ పార్ట్‌టైం ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు కమల, మాధవి, స్వప్నకుమారి, గంగజల, సుష్మా, అవినాశ్, లక్ష్మీనారాయణ, రమ్యశ్రీ, మాధురి, ప్రభాకర్, సుజాత, కల్యాణి, ధనలక్ష్మి, గంగామణి, శ్రీకృష్ణ, ప్రణీత్, శిల్ప, మహిపాల్, రాజకళ పాల్గొన్నారు.

ముగిసిన ఇండక్షన్ ప్రొగ్రాం

బాసర, సెప్టెంబర్ 4 : బాసర ఆర్జీయూకేటీలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు 13 రోజులుగా నిర్వహిస్తున్న ఇండక్షన్ ప్రొగ్రాం బుధవారం ముగిసినట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్‌సాగి, అసోసియేట్ డీన్స్ డాక్టర్ చంద్రశేఖర్, మహేశ్‌లు ప్రసంగించారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, పబ్లిక్ స్పీకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, సైబర్ సెక్యూరిటీ, క్రీడారంగం, డిసిషన్ మేకింగ్, టైం మేనేజ్‌మెంట్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త కిరణ్‌కుమార్, ఉద్యోగుల పవన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ అధికారులు

జైనూర్‌లో దుకాణ సముదాయాలకు నిప్పు పెట్టడంతో చెలరేగుతున్న మంటలు

పరిస్థితిని అదుపు చేస్తున్న ప్రత్యేక పోలీసు బలగాలు

జైనూర్‌లో భయానకం

ఆదివాసీ మహిళ పై లైంగిక దాడి ఘటనతో మండిపడ్డ ఆదివాసులు

- ఓ వర్గానికి చెందిన 50కిపైగా వ్యాపార సముదాయాలు దగ్ధం
- బైక్‌లు, బొలెరోకు నిప్పు.. పదుల సంఖ్యలో కాలిబూడిదైన వాహనాలు
- శ్మశానాన్ని తలపిస్తున్న జైనూర్ మండల కేంద్రం
- ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల పోలీసుల మోహరింపు
- బుధవారం రాత్రి వరకు కూడా వీడని ఉత్కంఠ
- జైనూర్‌లో 144 సెక్షన్ అమలు : ఎస్పీ గౌష్ ఆలం

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో బుధవారం భయానక వాతావరణం నెలకొన్నది. ఆదివాసీ మహిళపై లైంగికదాడి, హత్యాయత్నానికి యత్నించిన ఘటన ఆగ్రహానికి కారణమైంది. ఒక వర్గానికి చెందిన ఆటో డ్రైవర్ చేసిన పనితో సహనం కోల్పోయిన ఆదివాసులు వారి వ్యాపార సముదాయాలను కాల్చి బూడిద చేశారు. రోడ్డుపై నిలిపిన వాహనాలకు నిప్పు పెట్టారు. ఈ దాడిలో దాదాపు 50కి పైగా దుకాణాలు, పదుల సంఖ్యలో వాహనాలు కాలి బూడిదయ్యాయి. దుకాణాలు, వాహనాలు కాలుతున్న దృశ్యాలతో మండల కేంద్రం యుద్ధ వాతావరణాన్ని తలపించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి ప్రత్యేక పోలీసు బలగాలు జైనూర్ మండల కేంద్రానికి చేరుకుని పరిస్థితిని అదుపులో తెచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. జైనూర్ మండల కేంద్రంలో అకస్మాత్తుగా జరిగిన ఘటనతో సామాన్యులు భయభ్రాంతులకు గురయ్యారు. సాధారణ ప్రజలు బయటికి రావాలంటే వణికిపోతున్నారు.

వ్యాపార సముదాయాలకు నిప్పు

తమ సోదరుడికి రాఖీ కట్టేందుకు ఆటోలో వెళ్తున్న ఆదివాసీ మహిళపై ఆటోడ్రైవర్ లైంగిక దాడికి పాల్పడి హత్యాయత్నం చేశాడు. ప్రాణపాయ స్థితుల్లో ఉన్న ఆదివాసీ మహిళ గాయాలతో రోడ్డుపైకి వచ్చి కొంతమంది సహాయంతో ఆసుపత్రికి చేరుకున్నది. ఆలస్యంగా వెలుగులో వచ్చిన ఈ ఘటన ఆదివాసీ వర్గాలను ఆగ్రహానికి గురి చేసింది. దీంతో రెండు రోజుల క్రితం జైనూర్ మండల కేంద్రంలో రాస్తారోకో చేసిన ఆదివాసులు బుధవారం జైనూర్ బంద్‌కు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసులు భారీ సంఖ్యలో తరలిరాగా.. ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డ ఆటో డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నామని, చట్టపరంగా శిక్షిస్తామని ఆదివాసులకు వివరించారు. అయినప్పటికీ శాంతించని ఆదివాసులు జైనూర్ మండల కేంద్రంలో ఉన్న ఆటో డ్రైవర్ వర్గానికి చెందిన వ్యాపార సముదాయాలపై దాడులు చేశారు. మూసి ఉన్న దుకాణాల తాళాలను పగులగొట్టి షాపులకు నిప్పు పెట్టారు. రోడ్లపై నిలిపి ఉన్న వాహనాలను కాల్చిబూడిద చేశారు. ఓ వర్గానికి చెందిన ప్రార్థనా మందిరంలో చొరబడి విధ్వంసం చేశారు. దీంతో ఆటో వర్గానికి చెందిన వారు కూడా కర్రలు, రాళ్లు వంటి ఆయుధాలతో ఎదురు దాడికి ప్రయత్నం చేశారు. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌కు చెందిన ప్రత్యేక పోలీసు బలగాలు జైనూర్‌కు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. జైనూర్ మండల కేంద్రాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోడ్లపై ఎవరూ తిరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ ఇరువర్గాల మధ్య ఘర్షణతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయానక పరిస్థితి ఎదురైంది. సామాన్య ప్రజలు రోడ్డుపైకి రావడానికి వణికిపోతున్నారు. గత ఎన్నికల సమయంలో కూడా ఇలాంటి ఘటనలే చోటు చేసుకోవడంతో జైనూర్ దాదాపు పది రోజులుపాటు దుకాణాలు మూసి ఉంచారు. ఆదివాసులు, ఆటో డ్రైవర్ వర్గానికి గత కొన్ని ఏండ్లుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయానక పరిస్థితి నెలకొన్నది. జైనూర్ మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల ఉన్న ఆదివాసీ గ్రామాల ప్రజలు, ఆటోడ్రైవర్ వర్గానికి చెందిన ప్రజలపై పోలీసులు గట్టి నిఘా ఉంచారు.

బాధితురాలిని పరామర్శిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 4 : ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. ఆదివాసీ మహిళకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆదివాసులపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రశాంత వాతావరణం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జైనూర్ మండలంలో గతంలోనూ ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నట్లు గుర్తు చేశారు. అక్కడ జరుగుతున్న ఘర్షణలపై ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

సంయమనం పాటించాలి..

- ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, సెప్టెంబర్ 4 : జైనూర్‌లో జరిగిన ఘటనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని, పోలీసు యంత్రాంగం కేసులను నమోదు చేసిందని, దర్యాప్తు కొనసాగుతుందన్నారు. కారకులపై చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని తెలిపారు. సోషల్ మీడియాపై నిఘా ఉందన్నారు. జైనూర్‌లో 144 సెక్షన్ అమలులో ఉందని, ఇతర ప్రాంతాలవారికి జైనూర్‌లో అనుమతి లేదన్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తప్పు చేసిన వారికి శిక్షలు తప్పవని తెలిపారు.

మాట్లాడుతున్న గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు

ఉరి తీయాలి

- ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసిన ఓ వర్గానికి చెందిన ఆటోడ్రైవర్‌ను శిక్షించాలి
- గాదిగూడ మండలంలోని లోకారి(కే)లో ఆదివాసుల నిరసన

నార్నూర్, సెప్టెంబర్ 4 : ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసిన వ్యక్తిని ఉరి తీయాలని, కఠినంగా శిక్షించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని లోకారి(కే)లో గల కుమ్రం భీం చౌరస్తా వద్ద ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ మండలాధ్యక్షుడు మడావి చంద్రహరి మాట్లాడుతూ.. ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసిన నిందితుడికి ఉరిశిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన పెద్ద ఎత్తున చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పెందోర్ సంతోష్, మాజీ సర్పంచ్ మెస్రం దేవ్‌రావ్, కొడప జాకు, మాజీ ఎంపీటీసీ సిడాం నాగోరావు, నాయకులు పెందోర్ మధు, నటరాజ్, గంగారాం, జ్యోతిరాం పాల్గొన్నారు.

నిందితుడిని శిక్షించాలి..

ఆదివాసీ మహిళపై లైంగికదాడి, హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నార్నూర్ మండల కేంద్రంలోని కుమ్రం భీం కాంప్లెక్స్‌లో గల కుమ్రం భీం విగ్రహం వద్ద తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ మాట్లాడారు. జైనూర్ మండలంలోని దేవుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మానిక్‌రావు, కార్యనిర్వహణ అధ్యక్షుడు మడావి సాగర్, మండలాధ్యక్షుడు అడా శ్రీరాం, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ దాదిరావ్, ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ మెస్రం మోతీరాం, జై భారత్ జిల్లా అధ్యక్షుడు పెందోర్ దీపక్, నాగోరావ్, పెందోర్ సంతోష్ పాల్గొన్నారు.

దాడులను సహించం

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 4 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్‌లో ఓ గిరిజన మహిలపై లైంగికదాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ గిరిజనులపై దాడులను సహించమని, గిరిజన మహిళపై అత్యాచారయత్నం చేసి తీవ్రంగా గాయపర్చిన వ్యక్తిని బహిరంగా ఉరి తీయాలన్నారు.

ఆదివాసులపై దాడులను అరికట్టాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 4 : ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న ఆదివాసులపై దాడులను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని ఎంపీ నగేశ్ డిమాండ్ చేశారు. గతంలో ఎన్నికల సమయంలో కూడా గిరిజనులపై దాడులు జరిగాయని, దాడులకు పాల్పడిన వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నార్నూర్‌లో మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

శాంతియుతంగా పండుగలను జరుపుకోవాలి

నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

భైంసా, సెప్టెంబర్ 4 : అన్ని వర్గాలకు చెందిన ప్రజలు పరస్పర సహకారంతో ప్రతి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. గురువారం భైంసా పట్టణంలోని భట్టిగల్లిలో గల మున్నూరు కాపు సంఘ భవనంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పోలీసులు గణేశ్ మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భైంసా పట్టణ ప్రజలు ఐకమత్యానికి చిహ్నంగా ఉండాలని అన్నారు. గణేశ్ మండపాల వద్ద బాధ్యులు ఫోన్ నంబరుతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసు అధికారులు బ్లూకోల్ట్ సిబ్బంది తరచూ మండపాల్లో తనిఖీ చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసు శాఖ నియమ, నిబంధనలు పాటించాలన్నారు. భైంసాలో గణపతి నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించి రాష్ట్రంలోనే మంచి పేరు తీసుకొద్దామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అవినాశ్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, కమిషనర్ రాజేశ్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్, మాజీ అధ్యక్షుడు విలాస్ గాదేవార్, భట్టిగల్లి సర్పంచ్ తూమోల్ల దత్తాత్రి, మాజీ సర్పంచ్ మల్లేశ్, నాయకులు గాలి రవి, కపిల్, అల్లెం, శీను, దిలీప్, గౌతం పింగ్లే, చందూలాల్, పోశెట్టి, గణేశ్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

జూడాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ఎదులాపురం, సెప్టెంబర్ 4 : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ బుధవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రిమ్స్ జూనియర్ డాక్టర్లు నిరసన చేపట్టారు. వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తులతో నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. మెడికల్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ రిమ్స్ ఎమర్జెన్సీ వార్డుకు సాగింది. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని జూడాలు స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో రిమ్స్ స్టూడెంట్స్, జూనియర్ డాక్టర్స్ అన్వేష్, సందీప్‌చారి, మల్లికార్జున్, ప్రసన్న, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న జూనియర్ డాక్టర్లు